ఇంటింటా రేషన్‌కు స్వస్తి

- ఇకపై లబ్ధిదారులకు తప్పని కుస్తీ
- కూటమి ప్రభుత్వం నిర్ణయంపై సర్వత్రా విమర్శలు
- ఆందోళనలో లబ్ధిదారులు
- రోడ్డున పడ్డ ఎండీయూ వాహనం ఆపరేటర్లు

పెదపూడి: పేద, సామాన్య వర్గాలకు చెందిన లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం మరో పెద్ద షాక్ ఇచ్చింది. నిన్నటి వరకు ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందజేసే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనం సేవలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేయడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని సాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎండీయూ వాహనాలను నిలిపి వేస్తున్నట్లుగా ప్రకటించడంతో ఇంటి గుమ్మంలో అందుకునే బియ్యం, చక్కెర, కందిపప్పు కోసం ఇకపై రేషన్ డిపోల వద్ద క్యూలో నిల్చోవాల్సిందేనా, మరలా పాతరోజులు వచ్చేస్తున్నాయా అంటూ ప్రజలు హడలెత్తిపోతున్నారు. జూన్ 1 నుంచి వాహన సేవలు ఆగిపోతున్నాయని తెలిసిన ప్రజలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రేషన్ డిపోల వద్ద నిలబడలేక, సర్వర్ మొరాయించి, సరుకుల కోసం తిరగాల్సి రావడం, బియ్యం మూటలు మోయలేక కూలబడిపోవడం వంటి రోజులు మళ్లీ వచ్చేస్తున్నాయని కూటమి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు.

మన్ననలు పొందిన ఎండీయూ సేవలు

ప్రజాసంకల్ప పాదయాత్రలో గుర్తించిన సమస్యను వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు కాగానే రాష్ట్ర వ్యాప్తంగా వాహనాలను కొనుగోలు చేసి ఎండీయూగా నామకరణం చేయడం వాహనాలకు ఆపరేటర్, ఒక అసిస్టెంట్‌ను ఏర్పాటు చేసి గడప వద్దకే రేషన్ సరుకులను పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇంటి గుమ్మంలోకి వచ్చి బయోమెట్రిక్ వేయించుకుని వాహనంలోని బియ్యాన్ని అందించే ఎండీయూ సేవలను నిలిపివేయడంపై కూటమి ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డున పడ్డ ఎండీయూ ఆపరేటర్లు

ఐదేళ్లకుపైగా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు గుమ్మంలోకి అందించి ఉపాధి పొందుతున్న ఆపరేటర్లు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి రోడ్డున పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పలు సందర్భాల్లో ఎండీయూ వాహనాలపై ఆరోపణలు, అపోహలు ప్రచారం చేసి వాహన సేవలు బాగున్నాయంటూనే తొలగింపు నిర్ణయం తీసుకోవడంతో అంతా ఆందోళనకు గురవుతున్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించినా తొలగింపు నిర్ణయంతో ఉపాధి కోల్పోయి రోడ్డు పాలయ్యామంటూ ఎండీయూ ఆపరేటర్లు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ ఆపరేటర్లు నిరసనలు తెలుపుతూ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నారు.

మండలం	రేషన్ షాపులు	రేషన్ కార్డులు	ఎండీయూ వాహనాలు
అనపర్తి	39	23,004	14
బిక్కవోలు	40	22,986	14
పెదపూడి	42	23,786	16
రంగంపేట	30	21,070	13
రాజానగరం	48	36,905	17
కోరుకొండ	43	27,500	19
సీతానగరం	48	24,632	16
మొత్తం	290	1,79,883	109


జి.మామిడాడలో ఎండీయూ వాహనం వద్ద రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో 109 ఎండీయూ వాహనాలు, 1,79,883 రేషన్ కార్డులు

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో ఏడు మండలాల్లో 109 ఎండీయూ వాహనాల ద్వారా 1,79,883 మంది రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు అందించేవారు. ఇప్పుడు ఎండీయూ వాహనాల రద్దుతో లబ్ధిదారులు సమీపంలోని రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకునే దుస్థితి ఏర్పడనుంది.

ఎండీయూ ఆపరేటర్లంతా రోడ్డున పడ్డాం



కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో ఎండీయూ ఆపరేటర్లంతా రోడ్డున పడ్డాం. ప్రజలకు నేరుగా అందుతున్న సేవలను నిలిపివేయడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది ఆపరేటర్లకు ఉపాధి లేకుండా చేశారు. ఎండీయూ వాహనాల ద్వారా ఉపాధి పొందుతున్న ఆపరేటర్లపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని తిరిగి సేవలను పునరుద్ధరించాలి.

– సొంబత్తుల రవిచంద్ర ఎండీయూ ఆపరేటర్, మండల అసోసియేషన్ ప్రతినిధి, కరకుదురు

పాత రోజులు వస్తున్నాయి



గతంలో రేషన్ డిపోలో బియ్యం తెచ్చుకునేందుకు రోజుల తరబడి గంటల వ్యవధిలో క్యూలో నిలబడాల్సి వచ్చేది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి గుమ్మంలోకే బియ్యం సరుకులు అందజేశారు. నేడు ఆ వాహనాలను తొలగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా నేడు మరలా పాత రోజులు వస్తున్నట్లుగా ఉన్నాయి. మరలా రేషన్ కోసం డిపోల ముందు పడిగాపులు తప్పవు.

– సమ్మంగి పద్మావతి, పెదపూడి

క్లుప్తంగా

పుస్తక పఠనం విద్యా చైతన్యానికి నాంది


రంగంపేట గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

రంగంపేట: పుస్తక పఠనం విద్యా చైతన్యానికి నాంది అని స్థానిక గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 30 రోజులు పూర్తయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం దిన చర్యగా చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. డి.మాధవి పాల్గొని తెలుగు శతక పద్యాల భావం, తాత్పర్యం వివరించారు. అనంతరం చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అవినాష్, అనంతలక్ష్మి, షేక్ వలీ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు

బిక్కవోలు: స్థానిక కుమార సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం స్వామి వారికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రత్యేకంగా అలంకరించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సాక్షి ఇండస్ట్రీయల్ ఫీడర్‌పై వార్షిక మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ తెలిపారు. ఆ సమయంలో పల్లకడియం, రామస్వామిపేట ప్రజలకు విద్యుత్ ఉండదన్నారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు


కోరుకొండ: బాల్య వివాహాలు సమాజ వికాసానికి విఘాతం కలిగిస్తాయని, వాటిని అరికట్టడానికి సమష్టిగా కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి క్రాంతిలాల్ అన్నారు. కోరుకొండ సచివాలయం -2లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు ప్రజలకు అవగాహన లేక బాల్యవివాహాలను నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాల్లో నిరంతర ప్రయత్నం ద్వారా వీటిని అరికట్టగలమన్నారు. సమావేశంలో జిల్లా కో ఆర్డినేటర్ బి.రాజకుమారి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఝాన్సీ, లక్ష్మి, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎం, వీఆర్వోలు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లపై నిల్వ నీరు


సీతానగరం వెలమపేటలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లపై నీరు నిల్వ ఉండిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వేసిన సిమెంట్ రోడ్లు పల్లంగా మారడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. ముఖ్యంగా పురుషోత్తపట్నం, సీతానగరం వెలమపేట, ముగ్గళ్ల గ్రామాల్లో కొద్దిపాటి వర్షానికే నీరు నిల్వ ఉండిపోతోంది. బయటకు వెళ్లే మార్గం లేకపోవడంలో అక్కడే ఉండిపోతోంది. దాదాపు పది రోజుల పాటు ఎండ కాస్తే వరకూ అలాగే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా రోడ్లకు డ్రైనేజీలు లేకపోవడంతో దీనికి ప్రధాన కారణం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టి సారించి, నీరు తరలివెళ్లడానికి కచ్చా డ్రైనేజీలు తీయించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి


కాండ్రేగులలో పవర్ టిల్లర్ రైతుకు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కాండ్రేగులలో మంగళవారం రైతులకు రెండు పవర్ టిల్లర్ వ్యవసాయ పనిముట్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గండ్రేడు, జి.మామిడాడ గ్రామాల్లో నేరేళ్లమ్మ తీర్థం సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జుత్తుక సూర్య కుమారి, ఎన్డీఏ నాయకులు రావడ నాగు, సింగినీడి నాగతిరుపతిరావు, పి.శివ, జుత్తుక సూరిబాబు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి

కోరుకొండ: యువత సన్మార్గంలో పయనించేలా పాస్టర్లు కృషి చేయాలని కోరుకొండ ఎస్సై కూన నాగరాజు అన్నారు. జంబూపట్నం కల్వరి మినిస్ట్రీస్‌లో మంగళవారం యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు ఒరిగేటి ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎస్సై నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చర్చిల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. తీవ్రవాద చర్యలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అనంతరం ఎస్సై నాగరాజును శాలువా, పూలమాలలతో పాస్టర్లు ఘనంగా సత్కరించారు. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ సేవే ప్రధాన లక్ష్యంగా యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు నక్కా నంద కుమార్, సంస్థ ఫౌండర్ చిర్రా ప్రసాద్, అధ్యక్షుడు ఎలియాజర్, కార్యదర్శి రాజా రమేష్ పాల్గొన్నారు.


ఎస్సై నాగరాజును సత్కరిస్తున్న పాస్టర్లు

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

సీతానగరం: మునికూడలికి చెందిన బాలికపై అత్యాచారయత్నం చేసిన బోడి వెంకట ప్రసాద్‌కు కోర్టు రిమాండ్ విధించిందని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 11 ఏళ్ల బాలిక ఈ నెల 25వ తేదీన తన పిన్నికి కూర ఇచ్చేందుకు వెళ్లింది. ఆ ఇంటికి తాళం వేసి ఉండడంతో పక్క ఇంటిలో ఉంటున్న వెంకట ప్రసాద్‌ను ఆ తాళం తీయాలని కోరింది. అయితే ప్రసాద్ తాళం తీసిన తర్వాత బాలికను ఇంటిలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేయబోయాడు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేస్తూ పరుగున ఇంటి నుంచి బయటకు వచ్చింది. దీనిపై ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో, ఎస్టీ ఎస్సీ కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు వెంకట ప్రసాద్‌ను ఇంటి దగ్గరలో నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ అరెస్ట్ చేశారు. రాజమహేంద్రవరం 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా వెంకట ప్రసాద్‌కు రిమాండ్ విధించారని, అతడిని సెంట్రల్ జైలుకు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెదపూడి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణ అన్నారు. పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో మంగళవారం మండలంలోని సచివాలయం ఉద్యోగులు, ఇతర అధికారులకు యోగాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21 వరకూ యోగా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో యోగా మాస్టార్లు, అధికారులు, పాల్గొన్నారు.

బిక్కవోలు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవో ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక మండలం పరిషత్ కార్యాలయం వద్ద రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు యోగాసనాలు వేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజుల పాటు యోగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పెదపూడిలో యోగాసనాలపై అధికారులకు శిక్షణ ఇస్తున్న యోగా మాస్టార్లు

జారి పడితే ప్రమాదమే..


రోడ్డులో సగభాగాన్ని ఆక్రమించిన ఇసుక

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపై పేరుకుపోయిన ఇసుక కారణంగా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి జారిపడడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డుపై నిత్యం వందల ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంగలపూడి, సింగవరం, వంగలపూడి, రఘుదేవపురం, మునికూడలి, కాటవరం ర్యాంపు నుంచి ఇసుకను రవాణా చేస్తున్నాయి. ఆయా రేవుల నుంచి సుదూర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నాయి. లారీల్లో పరిమితికి మించి ఇసుకను లోడ్ చేయడం వల్ల ప్రయాణ సమయంలో జారి రోడ్డుపై పడుతోంది. దీంతో ఆ లారీల వెనుక వచ్చే వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై పడిన ఇసుక కారణంగా వాహనాలు జారిపోతున్నాయి. కాటవరం పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై ఇసుక పేరుకుపోయి ప్రమాదకరంగా మారింది. నాలుగు లైన్ల రోడ్డులో సగం భాగాన్ని ఆక్రమించేసింది.

రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా


సూరెడ్డి శివకుమార్

సీతానగరం: మండలంలోని ర్యాంపుల నుంచి రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని వంగలపూడికి చెందిన మాజీ సైనికుడు, న్యాయవాది సూరెడ్డి శివకుమార్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వంగలపూడి, సింగవరం ర్యాంపుల నుంచి రాత్రి సమయంలో ఇసుక రవాణా చేయవచ్చని మైన్స్ ఏడీ లెటర్‌ను స్థానిక ఎస్సైకు అందజేసి, పోలీసులను తప్పుదోవ పట్టించారని తెలిపారు. రాత్రి సమయంలో స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను రవాణా చేయడానికి అనుమతి లేదన్నారు. కేవలం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా 24 గంటలూ భారీ వాహనాలపై రవాణా చేస్తున్నారన్నారు. దీనిపై సోమవారం రాజమహేంద్రవరం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

సీతానగరం: వంగలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఆ హైస్కూల్లో 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానికంగా స్థిరపడిన వారితో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా తరలివచ్చారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని, ఉత్సాహంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థులు తిరుపతిపాటి సతీష్‌బాబు, షేక్ దాదా సాహెబ్, పోలిన సూరిబాబు, రాయంకుల ధర్మేంద్ర, నారే లక్ష్మణ్, ఇందుగుమిల్ల సతీష్, గురజా రాజు, కోండ్రపు ఫణీంద్ర, గద్దె సుధీర్, నందమూరి కిరణ్, పడగా రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. దీనిలో భాగంగా మంగళవారం బీవీఎం స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు బొడేం నాగశ్రీకాంత్ ఆధ్వర్యంలో నీతికథలు చెప్పడం, తెలుగు పద్యాలు (వేమన శతకం, సుమతి శతకం, కృష్ణ శతకం) పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ముందుగా కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు ఉపాధ్యాయుడు శ్రీకాంత్ మాట్లాడుతూ కందుకూరి గొప్ప సంఘ సంస్కర్త అని, నవయుగ వైతాళికుడిగా పేరు పొందారన్నారు. వివేక వర్ధిని పత్రికను స్థాపించి విద్యావ్యాప్తికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచి, ఆర్గానిక్ ప్రొడక్టుల ద్వారా రైతులు నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని ఏపీఈడీఏ, అగ్రికల్చర్ ప్రాసెసింగ్ ఫుడ్ ప్రొడక్ట్స్, ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ బి.అశోక్ కుమార్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం ఉద్యానవన, ఏపీఎంఐపీల ఆధ్వర్యంలో ఎఫ్‌పీవోలు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ అగ్రికల్చర్, హార్టికల్చర్ ఉత్పత్తులను ఎగుమతులు చేసేటప్పుడు ఎదుర్కొనే సమస్యలను అధిగమించడానికి తీసుకోవాల్సిన విధి విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆహార ఉత్పత్తుల్లో అధిక దిగుబడులు సాధించడానికి రసాయన (కెమికల్స్) పదార్థాలు అధికంగా వాడకం వల్ల నాణ్యత ప్రమాణాల పరీక్షలు చేపట్టే సందర్భంలో పలు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. వాటిని అధిగమించడానికి ప్రకృతి వ్యవసాయ సాగు (ఆర్గానిక్ ప్రొడక్ట్స్) ఉత్పత్తుల ద్వారా మంచి నాణ్యమైన పంటలు అందించవచ్చన్నారు. ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో)ని ఏపీఈడీఏలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఇతర దేశాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ కుమార్

ఎగుమతులపై అవగాహన

జిల్లా ఉద్యానశాఖ అధికారి బి.సుజాత కుమారి మాట్లాడుతూ ఉద్యాన రైతులందరూ పంటల ఎగుమతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. రసాయనాల వాడకం వల్ల ఆహార పదార్థాల నిల్వ సామర్థ్యం తగ్గిపోవడమే కాకుండా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ రైతులందరూ ఎఫ్‌పీవో ద్వారా ప్రభుత్వ సబ్సిడీలను ఉపయోగించుకుని క్వాలిటీ ప్రొడక్టులు అందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ ఎ.దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యానవన పంటల ద్వారా వచ్చే ఉత్పత్తులు ఎక్కువగా ఉంటాయన్నారు. సమావేశంలో ఆర్గానిక్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు, ఎఫ్‌పీవోలు పాల్గొన్నారు.

కందుకూరి ఆశయ సాధనకు కృషి

- మంత్రి దుర్గేష్
- నవయుగ వైతాళికునికి నివాళి

సీటీఆర్ఐ: నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం ఆశయాల సాధనకు కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. వీరేశలింగం వర్ధంతి సందర్భంగా హితకారిణి సమాజం ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి స్థానిక ఆనంద గార్డెన్స్‌లోని కందుకూరు దంపతుల సమాధులకు పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన మూఢ నమ్మకాలపై వీరేశలింగ పోరాటం చేసి, ప్రజలను చైతన్యవంతులు చేశారన్నారు. మహిళలు చదువుకుంటే సమాజంలోని పరిస్థితులు బాగుపడతాయని నమ్మి మహిళల కోసం చదువు కోసం విద్యాలయాలను స్థాపించారన్నారు. హితకారిణి సమాజం అసిస్టెంట్ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.వినోద్ కుమార్, డాక్టర్ పీవీబీ సంజీవరావు, డాక్టర్ బీవీ రమణమూర్తి పాల్గొన్నారు


కందుకూరి సమాధికి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

- స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం వర్ధంతి నిర్వహించారు. కందుకూరి విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి నివాళులర్పించారు.
- కందుకూరి వీరేశలింగం పంతులు అభ్యుదయ భావాలు, ఆశయాలను ముందుకు తీసుకువెళతామని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్న కందుకూరి వీరేశలింగం పంతులు విగ్రహానికి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు, రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బి.జార్జి ఆంటోని, ఉపాధ్యక్షుడు బత్తిన ఏడుకొండలు పాల్గొన్నారు.
- కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త అని డీసీసీబీ మాజీ చైర్మన్, టౌన్ హాల్ కార్యదర్శి ఆకుల వీర్రాజు కొనియాడారు. కందుకూరి నిర్మించిన పుర మందిరం (టౌన్ హాల్)లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టౌన్ హాల్ లైబ్రేరియన్ సుబ్బారావు, తూర్పుగోదావరి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీవీ అప్పారెడ్డి, ట్రెజరర్ కె.సత్యనారాయణ, టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు.


ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో..


కోటిపల్లి బస్టాండ్‌లోని వీరేశలింగం విగ్రహానికి నివాళి


టౌన్‌హాలులో కందుకూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆకుల వీర్రాజు తదితరులు

టెర్రస్ గార్డెనింగ్‌తో ఎంతో ప్రయోజనం

రాజమహేంద్రవరం సిటీ: నగర వాతావరణాన్ని కాలుష్యం నుంచి కాపాడేందుకు టెర్రస్ గార్డెనింగ్ ఎంతో దోహదపడుతుందని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయ భవనంపై మంగళవారం అధికారులతో కలిసి ఆయన మొక్కలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ఇటీవల కాలంలో టెర్రస్ గార్డెనింగ్ విపరీతంగా పెరిగిందన్నారు. చాలామంది ప్రజలు తమ భవనాలపై కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను సేంద్రీయ పద్ధతుల్లో, సహజ సిద్ధంగా పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. దీనివల్ల పర్యావరణ వ్యవస్థ మెరుగుపడుతుందని, కాలుష్య సంబంధిత సమస్యలు రావన్నారు. ప్రతి ఒక్కరూ తమ మేడపైన ఖాళీ ఉంచకుండా, వారికి తోచిన సమయంలో టెర్రస్ గార్డెనింగ్ అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, ఈఈ మాధవి, ఏడీహెచ్ కె.స్వాతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


టెర్రస్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్